క్లుప్తంగా

వేడుకగా లక్ష తులసీ పూజ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): వెంకటేశ్వరపురంలో కొలువైన శ్రీదేవీ, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష తులసీ పూజ, స్నపన తిరుమంజనాన్ని మంగళవారం నిర్వహించారు. అనంతరం పుష్పయాగాన్ని నేత్రపర్వంగా జరిపారు. భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు



నెల్లూరు(బృందావనం): విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని డీఈఓ బాలాజీరావు కాంక్షించారు. నగరంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలో గల రోటరీ క్లబ్‌లో 13 మంది విద్యార్థులకు రూ.ఐదు వేల చొప్పున ప్రోత్సాహకాలు, ప్రశంసపత్రాలు, బ్యాగులను రోటరీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ బెజవాడ నరేష్‌చంద్రారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ మధుసూదన్‌రావు, సెక్రటరీ సనత్‌కుమార్‌రెడ్డి, అఖిలేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిలో విశేష పూజలు



నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా విశేష పూజలను వైఖానస ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితుల జరిపారు. ఉభయ కర్తలుగా కాకాణి నరహరిరెడ్డి దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, ఈఓ వేమూరి గోపీ పాల్గొన్నారు.

కరాటేలో ఉత్తమ ప్రతిభ



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): తిరుపతిలో ఇటీవల నిర్వహించిన సౌతిండియా కరాటే చాంపియన్‌షిప్‌లో టీపీగూడూరు, సౌత్ ఆమలూరు క్రీడాకారులు సత్తా చాటారని కరాటే ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జనరల్ సెక్రటరీ అశోక్ మంగళవారం తెలిపారు. పోటీల్లో శశాంక్, ముకేష్, హేమంత్, యశ్వంత్, హిమభేష్ పతకాలను సాధించారని వివరించారు.

జార్జికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): బట్వాడిపాళెంలోని సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చిలో కెమెరామెన్ జార్జికి పలువురు నేతలు మంగళవారం నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, జయవర్ధన్ దంపతులు నివాళులర్పించారు.

అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని ఏకేనగర్ సబ్ డివిజన్, బీవీనగర్ సెక్షన్ పడారుపల్లి పరిధిలో గల సుందరయ్యకాలనీలో లో ఓల్టేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. డీఈఈ అశోక్, బీవీనగర్ సెక్షన్ ఏఈ దామోదర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చిలుకు ఏకాదశి



నెల్లూరు(బృందావనం): చిలుకు ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో విశేషాభిషేకాలు, అర్చనలు తదితరాలను భక్తిశ్రద్ధలతో మంగళవారం నిర్వహించారు. దేవస్థాన ప్రాంగణంలోని స్వామి వారి వనంలో అభిషేకాలు, పూజలను జరిపారు. ప్రాకారోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, విజయ తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన..

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు సోమవారం అర్ధరాత్రి నుంచి మొదలయ్యాయి. నగరంలో జోరు వాన మంగళవారం కురిసింది. ఈ క్రమంలో రహదారులపై గుంతల్లో నీరు భారీగా చేరింది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



దివ్యాంగురాలిని తీసుకెళ్తూ..



రెయిన్ కోట్ల విక్రయం



గొడుగు నీడలో ప్రయాణం



ఇబ్బందులు పడుతూ వెళ్తున్న విద్యార్థినులు



కూరగాయల మార్కెట్లో నిలిచిన వర్షపునీరు



రోడ్డుపై నిలిచిన నీరు



ట్రంక్‌రోడ్డు వద్ద ఇలా..

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(అర్బన్): రాష్ట్రంలో 108 ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సతీష్ డిమాండ్ చేశారు. జేమ్స్ గార్డెన్‌లో మంగళవారం నిర్వహించిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్లాబ్‌ల మేరకు ఉద్యోగులకు వేతనాలను తక్షణమే ఇవ్వాలని కోరారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఈఎంటీ పోస్టుల్లో 108 ఈఎంటీలను నియమించాలని చెప్పారు. డిమాండ్ల సాధన కోసం ఆందోళనలను ఉధృతం చేయనున్నామని తెలిపారు. యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్, నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ షాజహాన్, కోశాధికారి కిష్టయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సతీష్

పంచాయతీల్లో అభివృద్ధి పనులపై సమావేశం

నెల్లూరు సిటీ: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశాన్ని నెల్లూరు రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్ర పరిశీలకుడు రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గంలోని 18 పంచాయతీల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. డిస్ట్రిక్ట్ ట్రెయినింగ్ మేనేజర్ శివ, ఎంపీడీఓ శైలేంద్రకుమార్, మండలాధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేష్

అలరించిన నృత్య ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో సంప్రదాయ, శాస్త్రీయ నృత్య పోటీలను కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరిగెపూడి కృష్ణకుమారికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. బాలాజీ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి, శాస్త్రీయ నృత్యప్రదర్శనలు అలరించాయి. డ్యాన్స్ మాస్టర్ రమణయ్య, ప్రదీప్, రియాజ్‌బాషా, రఘురామిరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



వర్షాలతో ఇబ్బంది తలెత్తకుండా చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో కురుస్తున్న వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని కమిషనర్ సూర్యతేజ పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జిలు, పంప్‌హౌస్ తదితర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి మంగళవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రెయిన్లు, కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. నగరంలోని ప్రధాన మార్గాలు, అండర్ బ్రిడ్జిల వద్ద నీరు నిల్వ ఉండకుండా తోడేయాలని ఆదేశించారు. ఈఈలు శేషగిరిరావు, రహంతుజానీ, డీఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న సూర్యతేజ

రేపటి ధర్నా జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కలెక్టరేట్ వద్ద గురువారం నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా నగరంలోని 11, 13, 14, 15వ డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేసి కరపత్రాలను మంగళవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ ఇంటింటికీ స్టిక్కర్లను టీడీపీ అంటించడం సిగ్గుచేటని విమర్శించారు. నేతలు సూర్యనారాయణ, నాగేశ్వరరావు, కాయం శ్రీనివాసులు, మూలం ప్రసాద్, నరసింహ, సుబ్బమ్మ, రమణారెడ్డి, రషీద్, మురళి, శ్రీధర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపోరు యాత్రలో సీపీఎం నేతలు

కులగణన చేపట్టాల్సిందే..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో కులగణన చేపట్టాలని, లేకపోతే బీసీల సత్తా ఏమిటో ప్రభుత్వానికి చూపిస్తామని బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్, మాజీ డీజీపీ పూర్ణచంద్రరావు, రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి పేర్కొన్నారు. నగరంలోని గాంధీబొమ్మ సెంటర్‌లో మంగళవారం చేపట్టిన ధర్నాకు ముఖ్యఅతిథులుగా హాజరైన వీరు మాట్లాడారు. అమరావతి అభివృద్ధి పేరుతో రూ.15 వేల కోట్లను సీఎం చంద్రబాబు కేటాయించడం అక్కడి భూముల విలువను పెంచేందుకేనని ఆరోపించారు. కులగణనను చేపట్టేందుకు కూటమి సర్కార్ ఎందుకు భయపడుతోందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల పార్టీ అని చెప్పుకొనే టీడీపీ వారికి పంగనామాలు పెట్టిందని విమర్శించారు. ఢిల్లీ పెద్దలకు తలొగ్గిన చంద్రబాబు బీసీలను విస్మరించారని ఆరోపించారు. 90 శాతం జాతి సంపదను పది శాతం అగ్రవర్ణాల వారికే కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. కులగణన చేస్తారా.. లేక కుర్చీ ఖాళీ చేస్తారానని ప్రశ్నించారు. బీసీ సమన్వయ రాష్ట్ర కమిటీ చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు, కన్వీనర్ రమణ, గోవిందు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నేతలు

బెల్టుషాపుపై దాడి

నెల్లూరు(క్రైమ్): హరనాథపురంలోని నాగసాయినగర్‌లో బెల్టుషాపుపై ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు దాడులను మంగళవారం చేపట్టారు. నిర్వాహకుడు ప్రసాద్‌ను అరెస్ట్ చేసి అతని నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు –1 ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, ఎస్సై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కొండూరు అనిల్‌కు పరామర్శ

నెల్లూరు(సెంట్రల్): ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తండ్రి ఇటీవల మరణించారు. ఈ క్రమంలో ఆయన్ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫోన్లో మంగళవారం పరామర్శించారు.

నిధుల కేటాయింపుపై హర్షం

నెల్లూరు(బృందావనం): క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.151 కోట్లను రాష్ట్ర బడ్జెట్లో కేటాయించడంపై టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఊరందూరు సురేంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బట్వాడిపాళెంలో విలేకరుల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు.

• పాస్టర్ల గౌరవ వేతనానికి నిధులు కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెన్హర్‌బాబు, విజయకుమార్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్, జాషువా వేర్వేరు ప్రకటనల్లో కృతజ్ఞతలను తెలియజేశారు.

'మెడికవర్'లో అరుదైన సర్జరీ

నెల్లూరు(అర్బన్): శ్వాస తీసుకోలేని పరిస్థితుల్లో.. తీవ్రమైన ఆయాసంతో తమ ఆస్పత్రికి వచ్చిన 85 ఏళ్ల వృద్ధురాలికి ట్రకియల్ స్టినోసిస్ సర్జరీని నిర్వహించి ఆమె ప్రాణాలను కాపాడామని మెడికవర్ సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఆస్పత్రిలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన తెలియజేశారు. ఊపిరి తీసుకోలేకపోవడం, ఆయాసం తదితర లక్షణాలతో తమ ఆస్పత్రికి అనంతసాగరం మండలం బొమ్మవరానికి చెందిన వెంకటమ్మ వచ్చారని చెప్పారు. నోటిలో ఈటీ ట్యూబ్‌తో వెంటిలేటర్‌పై గతంలో పది రోజులు ఉన్నారనే విషయం తెలిసిందని తెలిపారు. బ్రాంకియోస్కోపీ పరికరంతో పరీక్ష చేయగా, శ్వాస నాళంలో కండపెరిగి గడ్డలా తయారైందనే అంశాన్ని గుర్తించామని పేర్కొన్నారు. అనస్థీషియా డాక్టర్ల సాయంతో ట్రకియల్ స్టినోసిస్ గ్రేడ్ – 4 అనే గడ్డను సర్జరీ ద్వారా తొలగించామని వివరించారు. రూ.40 వేల ఖర్చుతో ఆపరేషన్‌ను చేశామన్నారు. క్రిటికల్ కేర్ హెడ్ రాజేష్, అనస్థీషియా చీఫ్ రంగనాథ్, ఆస్పత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ యశ్వంత్ రెడ్డి, కేన్సర్ ఆస్పత్రి సెంటర్ హెడ్ బిందురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు

ప్రజల భాగస్వామ్యంతోనే విద్యుత్ ఆదా

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ప్రజల భాగస్వామ్యంతోనే విద్యుత్‌ను ఆదా చేయొచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల స్కాడా కార్యాలయంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లకు మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఊర్జవీర్ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు ఈ నెల 22న వర్చువల్‌గా ప్రారంభించనున్నారని వివరించారు. 15 నుంచి 20 శాతం విద్యుత్‌ను ఆదా చేయడమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. ఎల్ఈడీ బల్బులు, ట్యూబ్‌లైట్లు, బీఎల్డీసీ సీలింగ్ ఫ్యాన్లు, 1.5 టన్ను కలిగిన ఏసీలు, స్టౌవ్‌లు తదితరాలను ఈఈఎస్ఎల్ మార్ట్ పోర్టల్ ద్వారా విక్రయించనున్నారని పేర్కొన్నారు. వీటిపై ప్రజలకు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్లు అవగాహన కల్పించాలని కోరారు. వీటి విక్రయాలపై నిర్దేశిత మొత్తంలో కమీషన్‌ను ప్రతి నెలా ఎలక్ట్రీషియన్ల బ్యాంక్ ఖాతాల్లో జమచేయనున్నారని వివరించారు. ఈఈలు శేషాద్రిబాలచంద్ర, శ్రీధర్, బెనర్జీ, ఈఈఎస్ఎల్ కంపెనీ ప్రతినిధులు గీతా, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయన్

పాత నేరస్తుడిపై రౌడీషీట్

నెల్లూరు(క్రైమ్): నేరాలకు తరచూ పాల్పడుతున్న వారిని పోలీసులు గుర్తించి రౌడీషీట్లు తెరుస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రౌడీషీటర్లు, నేరస్తుల కదలికలపై పోలీస్ అధికారులు నిఘా పెట్టారు. వీరికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తీరు మారని వారి జాబితాలను సిద్ధం చేస్తున్నారు. పీడీ యాక్ట్‌ల నమోదుకు రంగం సిద్ధం చేశారని సమాచారం. కాగా నగరంలోని చిన్నబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలకు తరచూ పాల్పడుతున్న మనుమసిద్ధినగర్‌కు చెందిన జకీర్ బాషా, డైకస్‌రోడ్డు సుభాష్‌చంద్రబోస్‌నగర్‌కు చెందిన రబ్బానీపై రౌడీషీట్లను ఇటీవల తెరిచారు. తాజాగా ఖుద్దూస్‌నగర్‌కు చెందిన షమీర్‌పై మంగళవారం ఓపెన్ చేశారు.

సాగునీటి సంఘాల ఓటర్ల జాబితా విడుదల

నెల్లూరు రూరల్: ఇరిగేషన్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాను తహసీల్దార్ కార్యాలయాల పరిధిలో మంగళవారం విడుదల చేశారు. ఇందులో అభ్యంతరాలుంటే ఫారం – ఈ.. నమోదు కోసం ఫారం – ఎఫ్.. పేర్లపై అభ్యంతరాలు తెలిపేందుకు ఫారం – జీ.. పేరు తొలగింపునకు ఫారం – హెచ్ ద్వారా తహసీల్దార్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అభ్యంతరాలపై సబ్ కలెక్టర్, ఆర్డీఓల వద్ద ఈ నెల 14, 15వ తేదీల్లో అప్పీల్ చేసుకోవాలని సూచించారు.

డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపోకు సంబంధించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని మేనేజర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు ప్రయాణికులు ఫోన్ చేశారు. నెల్లూరు నుంచి సీఎస్‌పురానికి బస్సు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కొండాపురం బస్సును దామరమడుగు స్టేజీలో నిలపకుండా వెళ్లిపోతున్నారని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

జూనియర్ జడ్జిలకు అవగాహన

నెల్లూరు సిటీ: రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించిన చట్టాలపై జూనియర్ జడ్జిలకు అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్ వర్మ అవగాహన కల్పించారు.

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్‌ల అందజేత

నెల్లూరు సిటీ: నెల్లూరు – అల్లూరు మధ్య ప్రయాణిస్తున్న వారిలో ఇద్దరికి గిఫ్ట్‌లను లాటరీ ద్వారా రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ అందజేశారు. ఆత్మకూరు బస్టాండ్‌లో ప్రయాణికుల సమక్షంలో లాటరీ బాక్సులను మంగళవారం తెరిచారు. ఈ సందర్భంగా గిఫ్ట్‌లను సిరి, శిరీష దక్కించుకున్నారు.



లాటరీ తీస్తున్న అధికారులు

మహిళా సంఘ సభ్యులకు శిక్షణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏఎస్‌పేట మండల మహిళా వ్యవసాయ, రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘ సభ్యులకు శిక్షణ కార్యక్రమాన్ని నగరంలోని డీసీఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం సంఘ రిజిస్ట్రేషన్, నిబంధనావళి పుస్తకాలను అందజేశారు. డీసీఓ గుర్రప్ప, నాబార్డు డీడీఎం బాబు తదితరులు పాల్గొన్నారు.



సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR
■ 10th/Inter, BA, B.Com, B.Sc, BBA, BCA, B.Lis, MA, M.Com, M.Sc, MCA, MBA, M.Lis, Dip, B.Tech, M.Tech, M.Phil, Ph.D., BNYS, BPT. ✆ 90300 30125. [T-2378]

REAL ESTATE

HOUSE FOR SALE
■ గొలగమూడి దగ్గర 25అంకణాల స్థలంలో 2BHK మరియు 3BHK ఇల్లు కట్టించి ఇవ్వబడును. సంప్రదించండి : 9949921853, 6303724464. [NA-23856]

PLOT FOR SALE
■ గూడూరు To వెంకటగిరి రోడ్డులో గూడూరుకి 7కి.మీ దూరంలో మెయిన్‌రోడ్డు ఆనుకొని TNR మ్యాంగో గార్డెన్ ఫామ్‌ల్యాండ్ తిప్పవరప్పాడు అం॥60ప్లాట్లుఅం॥15లక్షలు. అం॥రేటు25000మాత్రమే. KVR. 9573475039. [N-1256674]

WANTED
■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [M-1253913]

■ Max,Life నెల్లూరు జిల్లాలో మండలాల వారీగా పని చేయుటకు (M/F) అడ్వైజర్లు కావలెను. రిటైర్డ్ ఉద్యోగులు, గృహిణీలకు ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం. (పార్ట్/ ఫుల్ టైం). 95506 74776. [NA-11166]

■ నెల్లూరు లోని ప్రముఖ బ్యాంక్ నందు పనిచేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. Q:10th పాస్, డ్యూటీ: 8 గం. PF, ESI సదుపాయం కలదు. వయస్సు 45 సం॥ లోపు. సెల్: 9848524061, 8500641105. [A-1399]

■ HERO స్పేర్స్ డిస్ట్రిబ్యూటర్స్ కంపెనీలో పనిచేయుటకు డ్రైవర్లు, హెల్పర్లు కావలెను. సంప్ర॥ ఇనమడుగు సెంటర్, నెల్లూరు. ✆ 94408 55079, 91000 66735 [O-793929]

ప్రకటన గోరంత
స్పందన కొండంత

CHANGE OF NAME
I, MOHAMMED GOUSEYA (Old Name), Resident of D.No. 13-1-573, Venkataramudu Street, Rajya Lakshmi Hall, Chinna Bazaar, Nellore, SPSR Nellore Dt, AP. Here by declare that I have changed my name as MOHAMMAD GOUSIA (New Name) W/o.Late AZEEZ AHMED.

■ కావలి నలంద EM స్కూలు నందు పని చేయుటకు 6th to 10th వరకు సోషల్, ఇంగ్లీషు & P.E.T టీచర్లు కావలెను. మంచి జీతం నాన్ లోకల్స్‌కి ఉచిత భోజన వసతి కల్పించబడును. సంప్ర:9030072316,99694 33348. [N-1237132]

■ ఫెయిత్ డా॥ రమణి, BPT, MIAP, 10th చదివిన అమ్మాయిలు, ఫిజియో అసిస్టెంట్లుగా, ఆయా కావలెను. మధురా స్వీట్స్ ఎదురు వీధి, బృందావనం2వ వీధి,నెల్లూరు.92464 65433. [NA-23858]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ:15-40వేలు. ఫ్రీ రూం+ భోజనం. HYD. 6309020999 [HA-95991]

■ త్రివేణి హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం. జీ: 18K. ఫోన్: 9160090024, 9640400073 [SCA24000627]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును.
ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.